

- ప్రాణాలను ఫణంగా పెట్టి విధి నిర్వహణ
- మందుపాతరలు, నక్సల్ తూటాలకు బలి
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 64 మంది అమరులు
- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం
- పది రోజుల పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణ
- ఘన నివాళులు అర్పించనున్న పోలీసులు, కుటుంబ సభ్యులు



శాంతి భద్రతల పరిరక్షణలో సమిధలు పోలీసులు

వివరాలు : 7 లో..

ప్రజల ధన, మానప్రాణాల రక్షణ కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టే త్యాగశీలురు పోలీసులు. ముష్కర మూకలను తరిమికొట్టే.. అసాంఘిక శక్తుల ఆట కట్టించే ధీరులు, సమాజ హితం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయని త్యాగధనులు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు అవిరామంగా కృషి చేస్తుంటారు. విధి నిర్వహణలో అరాచక శక్తుల ఆటకట్టిస్తారు. ఒక్కోసారి వారి చేతుల్లో ప్రాణాలు కోల్పోతుంటారు. పోలీసు విధి నిర్వహణ అత్యంత శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగాల్లా కొన్నిగంటలకే పరిమితమైనది కాదు. ఎండ, వాన, రాత్రీ పగలూ తేడా లేకుండా విధులు నిర్వర్తిస్తుంటారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేం. సంపన్నుడు మొదలు.. సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ ఆపదలో సాయం కోరేది పోలీసులనే. శత్రువుల నుంచి దేశాన్ని కాపాడేది సైనిక జవానులైతే.. అంతర్గత శత్రువు నుంచి ప్రజలను కాపాడేది పోలీసులు. సంఘ విద్రోహ శక్తులతో పోరాడి విధి నిర్వహణలో అమరులైన పోలీసులు కొందరైతే.. నక్సలైట్ల తుపాకీ గుండ్లకు, మందు పాతరలకు బలైన పోలీసు అమరవీరులు ఇంకెందరో. విధినిర్వహణలో అసులుబాసిన వారందరికీ అశ్రునివాళులర్పిస్తూ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా వారి గౌరవార్థం పోలీసు శాఖ ఏటా అక్టోబరు 21న పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

- ఆంధ్రజ్యోతి, హనుమకొండ



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారంలో కోలాహలం

- వనదేవతలను దర్శించుకున్న భక్తులు
- తల్లులకు భారీగా మొక్కులు

- 6వ పేజీలో..



హేమాచల క్షేత్రంలో భక్తులు

హేమాచల క్షేత్రంలో సందడి

- భారీగా తరలివచ్చిన భక్తులు
- లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

- 6వ పేజీలో..



ములుగులో బీఆర్ఎస్ నిరసన ర్యాలీ



చిట్యాలలో రోడ్డుపై బైఠాయించిన బీఆర్ఎస్ శ్రేణులు

'రైతు భరోసా' ఇవ్వనందుకు
బీఆర్ఎస్ నిరసనలు

ములుగు/భూపాలపల్లి కృష్ణకాలనీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): వానాకాలంలో రాష్ట్ర ప్రభుత్వం పంటల పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నిధులు మంజూరు చేయకపోవడంపై ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసనలు వ్యక్తమయ్యాయి. ములుగులో జిల్లా కమిటీ ఆధ్వర్యం లో కార్యక్రమాలు జరగాయి. ములుగులో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు నేతృత్వంలో మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట బైఠాయించారు. ఏటూరునాగారంలో తెలంగాణతల్లి విగ్రహం ఎదుట శ్రేణులు ఆందోళనకు దిగాయి. మంగపేట మండలంలో ప్రధాన రహదారిపై కార్యకర్తలు రాస్తారోకో చేశారు. అధికారంలోకి వచ్చేందుకు మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని నాయకులు విమర్శించారు. ఆరు గ్యారెంటీలను అమలుచేయడమే కాకుండా రూ.2లక్షల రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు.

భూపాలపల్లి ఎనిమిది మండలాల్లో..

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఎనిమిది మండలాల్లో బీఆర్ఎస్ శ్రేణులు నిరసనకు దిగాయి. రైతు భరోసా నిధులు విడుదల చేయాలని ఆ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంతో పాటు చిట్యాల, మొగుళ్లపల్లి, టేకుమట్ల, రేగొండ, గణపురం, కాటారం, మల్హర్ మండల కేంద్రాల్లోని ఆయా ప్రధాన కూడళ్లలో రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసు అధికారులు అక్కడికి చేరుకొని బీఆర్ఎస్ నేతలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

మూడు మండలాల్లో నిల్

మహదేవపూర్, మహాముత్తారం, పలిమెల మండలాల్లో బీఆర్ఎస్ నేతలు ఆందోళన చేపట్టలేదు. ఈ మూడు మండలాల్లో ఇది చర్చనీయాంశమైంది. పార్టీ అధిష్ఠానం పిలుపునిచ్చినప్పటికీ కేడర్ దూరంగా ఉండటంతో అంతర్యమేమిటోననే పలువురు చర్చించుకున్నారు.

సంక్షిప్త వార్తలు



ప్రమాణస్వీకారం చేయిస్తున్న రాఘవాచారి

సమాజంలో స్వర్ణకారుల పాత్ర కీలకం

- రాష్ట్ర అధ్యక్షుడు వింజయమూరి రాఘవాచారి

భూపాలపల్లి కృష్ణకా లనీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సమాజంలో స్వర్ణకారుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందని స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజయ మూరి రాఘవాచారి అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్‌కాలనీ సింగరేణి ఫంక్షన్‌హాల్‌లో సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా రాఘవాచారి హాజరయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రామగిరి సదానందాచారి, ప్రధాన కార్యదర్శి కట్ట శంకరమూర్తితో ప్రమాణ స్వీకారం చేయించారు. మన సంస్కృతీ సంప్రదాయాలు స్వకారుల వృత్తితో ముడిపడి ఉన్నాయన్నారు. అనాదిగా స్వకర్ణకారులు సమాజంలో కీలకంగా ఉన్నారని, ప్రస్తుతం వారు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కులస్థులంతా ఏకతాటిపై ఉంటూ హక్కులను సాధించుకోవా లన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేపూరి వెంకట స్వామి, కోశాధికారి గొట్టిముక్కుల చంద్రశేఖర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కట్ట ఈశ్వరచారి, జిల్లా స్వర్ణకార సంఘం కోశాధికారి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

కాటారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు. శనివారం రాత్రి పీఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా డ్రైవర్ పారి పోయాడన్నారు. దీంతో లారీని సీజ్ చేసి యజమానిపై కేసు నమోదు చేసినటు తెలిపారు.

క్రైం కార్నర్

చెరువులో దూకి యువతి ఆత్మహత్య



ఆలం స్వప్న(ఫైల్)

వాజేడు, అక్టోబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రేమ వ్యవహారంలో తల్లిదండ్రులు మందలించడంతో చెరువులో దూకి యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ములుగు జిల్లా వాజేడు మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆలం ధనలక్ష్మి, అంజనేయులు దంపతుల కుమార్తె స్వప్న (22) హనుమకొండలోని ఓ ప్రైవేటు కాలేజీలో డిప్లొమా ఇన్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వచ్చిన స్వప్న తాను ఓ యువకుడని ప్రేమిస్తున్నాననే విషయం తల్లిదండ్రులకు తెలిపింది. దీంతో తల్లిదండ్రులు ఆమెను మందలించారు. చదువుకొనే వయసులో ప్రేమలు ఎందుకని కోప్పడ్డారు. దీంతో స్వప్న మనస్తాపం చెందింది. బహిర్భూమికని శనివారం తెల్లవారుజామున ఇంటి పక్కనే ఉన్న చెరువు వద్దకు వెళ్లిన ఆమె అందులో దూకి ఆత్మహత్య చేసుకుంది. స్వప్న ఇంకా ఇంటికి రాకపోవడంతో కంగారు పడ్డ కుటుంబ సభ్యులు చెరువు వద్ద వెతకగా ఆమె చెప్పులు, సెల్‌ఫోను కనిపించాయి. దీంతో చుట్టుపక్కల వారి సాయంతో చెరువులో వెతకగా మృతదేహం లభ్యమైంది. స్థానికులు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరునాగారం వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అవమాన భారంతో యువకుడి ఆత్మహత్య

- బలవన్మరణానికి ప్రేరేపించారనే ఆరోపణలపై ఇద్దరి అరెస్టు

8



రవితేజ మృతదేహం

ఇద్దరు కార్మికుల దుర్మరణం

- జనగామ-సూర్యాపేట రహదారిపై బస్సు, ఆటోను ఢీకొన్న బైక్
- కర్నూల్, వనపర్తి జిల్లాలకు చెందిన యువకుల మృతి
- ఆటోలో ఉన్న మరో ముగ్గురికి తీవ్రగాయాలు

8



చెల్లా చెదురుగా పడి ఉన్న మృత దేహాలు

కుమరంభీం ఆశయాలను సాధించుకోవాలి

- ఆదివాసీ యువత హక్కులు పరిరక్షించుకోవాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క



కుమరంభీం విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జల్, జంగిల్, జమీన్ నినాదంతో ముందుకు నడిచిన యుద్ధవీరుడు కుమరంభీం ఆశయాలను సాధించుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మండలంలోని పస్రాలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మండల కమిటీ ఆధ్వర్యంలో కుమరంభీం 84వ వర్థంతి ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈసందర్భంగా ఆమె కుమరంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం సీతక్క మాట్లా డుతూ ఆదివాసీల అభివృద్ధి కోసం కుమరంభీం ఎన్నో పోరాటాలు చేశారని, ఆయన ఆశయాలను నెరవేర్చినప్పుడే అభివృద్ధి సాధ్యమని అన్నారు. ఆదివాసీ యువత అన్నిరంగాల్లో రాణిస్తూ తమ హక్కు లను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య, తుడుందెబ్బ మండల అధ్యక్షుడు గొంది కిరణ్, ఆదివాసీ సంఘాల నాయకులు వట్టం జనార్ధన్, చందా మహేష్, గొంది రాంచందర్, పొమ్మయ్య, నారాయణ, ముద్దబోయిన రాము, ఊకె జగ్గారావు, మడి సాయిబాబా, చెరుకుల సురేష్, విజయ, పాయం నారాయణ, సోలం కృష్ణయ్య, యాలం ఆదినారాయణ, పాపారావు, రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే కాంగ్రెస్ పాలన

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

చిట్యాల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రజాభీష్టం మేరకే కాంగ్రెస్ పరిపాలిస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలో ఆయన ఆదివారం పర్యటించారు. పలు గ్రామాల్లో పంచాయతీరాజ్ శాఖ నిధులు రూ. 4.15 కోట్లతో బీటీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బావుసింగ్‌పల్లి శివారు ప్రధాన రహదారి నుంచి గ్రామానికి రూ.1.40 కోట్లు, బావుసింగ్‌పల్లి నుంచి ముచినిపర్తి వరకు రూ. 1.50 కోట్లు, జూకల్లు ప్రధాన రహదారి నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు రూ.1.25 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సహకారంతో రహదారుల నిర్మాణాలకు నియోజకవర్గానికి రూ.50 కోట్లు కేటాయించారని అన్నారు. గత ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని, రాష్ట్రాన్ని అప్పులపాల్జేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రజలు సుభిక్షంగా జీవిస్తున్నారని అన్నారు. త్రిసభ్య కమిటీ నివేదిక వచ్చిన వెంటనే అర్హులైన రైతులకు ఎకరాకు రూ.15వేలు రైతు భరోసా అందిస్తామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసి సంవత్సరం పూర్తవుతున్న నేపథ్యంలో త్వరలోనే నియోజకవర్గానికి 4వేల చొప్పున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. అర్హులైన పేదలు ఇళ్లు నిర్మించుకుంటే రూ.5లక్షలు అందిస్తామన్నారు. సంక్షేమ పథకాల్లో దళారుల ప్రమేయాన్ని సహించనన్నారు. అవినీతిపరులు, దొంగలను జైలుకు పంపిస్తానని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం ఆస్పత్రిలో మెరుగైన వైద్య సౌకర్యాలు అందుతున్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు గణపురం మండలం మైలారం శివారులో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గుమ్మడి శ్రీదేవి సత్యనారాయణ, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ హేమ, ఎంపీడీవో రామకృష్ణ, పీఆర్ ఏఈ అరుణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూట్ల తిరుపతి, గ్రామ శాఖ అధ్యక్షుడు సూర నరేందర్, నాయకులు సంతోష్, శ్రీనివాసరావు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

AGRICULTURAL MARKETING DEPARTMENT

JAYASHANKAR BHUPALAPALLY DISTRICT

No.DMO/BPL/37/VANKALAM/2024-25 Date : 19-10-2024

SHORT TENDER NOTICE

Sealed quotations are called for supply of (180) No's Dial grain Caliper, (180) No's Husk Removers & (2) No's Paddy dryers, to various Agril. Market Committees in Jayashankar Bhupalapally District with the follwoing specification are finalized in respect of each item.

1. **Dial Grain Caliper :**
   Caliper to be used to measure the Rice grain, Accuracy 0.01mm / 0.0005' measurement capacity 0-12.7 mm / 0.5', placed in a Plastic box.
2. **Palm husk Remover :**
   ABC Plastic body quality, Rubber role hardness 60-70%. Size approximately 4 inch and rubber size 90mm, for de husking the paddy about 100 gram.
3. **Paddy Dryer :**
   Dryer Capacity : 5 Tones per Hour paddy drying capacity.

The interested Firms/Manufacturers may obtain tender schedules from District Marketing Officer Jayashankar Bhupalapally on payment of Rs.1,000.00 (Rs. One Thousand Only) by submitting DD's only. Tenders shall be accompanied with D.D. worth Rs. 10,000-00 (Rs. Ten Thousand each only) payable infavour of "District Marketing Officer Bhupalapally, payable at Warangal, towards Security deposit and Publication charges file the quotations in the tender box kept at District marketing Officer Jayashankar Bhupalapally. Any Other information can be had from the office of the District Marketing Officer Jayashankar Bhupalapally during working hours or Mobile No: 9550854834

TENDER DETAILS

Date of publication of Tender norice in News Paper : 21-10-2024

Date of sale of Tender Shedul : 22-10-2024 from 10.30 am to 24-10-2024 upto 01.00 pm

i) **Last Date of filing Tender : 24-10-2024 upto 03.00 pm**

ii) **Date of Opening of Tender : 24-10-2024 by 05.00 pm**

Sd/-
District Marketing Officer
Jayashankar Bhupalapally Dist.

Sd/-
District Collector
Jayashankar Bhupalapally Dist.



సభ్యత్వాలు స్వీకరిస్తున్న పార్టీ క్రమశిక్షణ చైర్మన్ ధర్మారావు

ప్రతి ఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకోవాలి

పార్టీ క్రమశిక్షణ చైర్మన్ ధర్మారావు

ములుగు, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఆ పార్టీ క్రమశిక్షణ చైర్మన్, రాష్ట్ర క్రియాశీల సభ్యత్వ నమోదు కన్వీనర్ మార్తినేని ధర్మారావు కోరారు. ములుగులో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా ధర్మారావు పాల్గొన్నారు. పలువురి నుంచి సభ్యత్వాలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా 11 ఏళ్లపాటు ప్రధాని నరేంద్రమోదీ పరిపాలన రామరాజ్యంగా సాగుతోందన్నారు. దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తున్న పార్టీ బీజేపీ అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు చిట్టచివరి వ్యక్తికి అందించడమే పార్టీ లక్ష్యమని పేర్కొన్నారు. గతంలో కంటే ములుగు నియోజకవర్గంలో ఎక్కువ సభ్యత్వాలు నమోదు కావడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, నాయకులు కొత్త సురేందర్, కృష్ణాకర్‌రావు, గంగిశెట్టి రాజ్‌కుమార్, గాదం కుమార్, బండి బాబు, రవితేజ పాల్గొన్నారు.

బాలపురస్కార్ అవార్డు గ్రహీతకు సీపీ అభినందన

హనుమకొండ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా బాలపురస్కార్ అవార్డును అందుకున్న కూచిపూడి నాట్య కళాకారిణి పెండ్యాల లక్ష్మీప్రియకు వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. రాజేష్ కుమార్ - సాయిలత దంపతుల కుమార్తె లక్ష్మీప్రియ ప్రముఖ కూచిపూడి నాట్య గురువు సుధీర్ వద్ద కూచిపూడి నృత్యంలో శిక్షణ పొంది కిందటేడు జాతీయ స్థాయిలో నిర్వహించిన కళోత్సవ్ పోటీల్లో అన్ని విభాగాల్లో ప్రథమంగా నిలవడంతో బాల పురస్కార్ అవార్డుకు ఎంపికైంది.

ఈ అవార్డును లక్ష్మీప్రియ ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అందుకోవడమే కాకుండా ప్రధాని నరేంద్రమోదీతో రెండు సార్లు అభినందనలు అందుకున్నారు. బాల పురస్కార్ అవార్డు అందుకున్న లక్ష్మీప్రియ విశ్రాంత పోలీసు అధికారి గంధం మనో హర్ మనవరాలు కావడం విశేషం.

వనదేవతలకు భక్తుల మొక్కులు



వన దేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం వనదేవతల సన్నిధిలో సందడి నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆదివారం భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క, సారలమ్మ అమ్మవార్ల గద్దెలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు బెల్లం (బంగారం), చీరె సారెలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేడారం పరిసరాల్లో విడిది చేసి ఆనందంగా గడిపారు. సుమారు 10 వేల మంది భక్తులు తల్లులను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.

మానుకోట కళాశాలను ఎంచుకోవాలి

ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్నరెడ్డి



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం అనంతారం మోడల్ స్కూల్ సమీపంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా ఫార్మసీ కళాశాలలో ప్రవేశం పొందేందుకు బాలికలు వెబ్ ఆప్షన్ ఎంచుకోవాలని ప్రిన్సిపాల్ స్వప్నరెడ్డి ఆదివారం ఒక ప్రటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను బి.ఫార్మసీలో ప్రవేశాల కోసం టీజీ-ఈఏపీ సెట్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఆయా కళాశాలల్లో ఈనెల 21 నుంచి 23 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందన్నారు. ఈ సర్టిఫికెట్ల పరిశీలనలో జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా ఫార్మసీ కళాశాలను కూడా అర్హులైన విద్యార్థినులు ఎంచుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని జిల్లా విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సన్మార్గంలో నడిపించేది గురువే..

- బీఆర్ఎస్ పాలనలో ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు
- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, వేదికపై ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డేపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): విద్యాబుద్ధులు నేర్పించి విద్యార్థులను సన్మార్గంలో నడిపించే మార్గదర్శి గురువులేనని రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ ప్రాంతంలోని టీటీడీ కల్యాణ మండపంలో రాష్ట్రోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) ఆధ్వర్యంలో భాషోపాధ్యాయులకు పదోన్నతులు ఇచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఆత్మీయ సన్మాన సభను పోలోజు శ్రీహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్ఎస్‌పాలనలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని దుయ్యబట్టారు. నిరుద్యోగుల భావోద్వేగాలను రెచ్చగొడుతూ ప్రతిపక్షాలు పబ్బం గడుపుతున్నాయని విమర్శించారు. రాష్ట్రంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించడం కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేశామని చెప్పారు.

పదేళ్లు గా వాయిదాలు పడుతున్న అన్ని ఉద్యోగాలను భర్తీ చేశామని స్పష్టం చేశారు. 15వేల మంది పోలీసు సిబ్బందిని కొత్తగా నియమించామని, 1,6 37 ఇంజనీరింగ్ పోస్టులు, 11,067 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి పరీక్షలు నిర్వహించి నియామక పత్రాలు అందించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పేపర్ లీకేజీలు చేసి నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిందని ధ్వజమెత్తారు. తెలం గాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర అని మంత్రి స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో చేయని అభివృద్ధి సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో శరవేగంగా జరుగుతోందని తెలిపారు. ప్రజాపాలనలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్‌దేనని అన్నారు. అనంతరం పోలోజు శ్రీహరి రచించిన రాష్ట్ర భక్తి గీతాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కర్రెం గౌరీ శంకర్‌రావు, గౌరవ అధ్యక్షులు పెండ్యాల బ్రహ్మయ్య, చౌడవరం చంద్ర మోహన్, వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు అడ్లూరి వెంకటేశ్వర్లు, పోలోజు శ్రీహరి, జిల్లా నాయకులు భద్రయ్య, షేక్ హాజీనూరాని తదితరులు పాల్గొన్నారు.

స్పౌజ్ విభాగం బదిలీలు చేపట్టాలి

ప్రభుత్వం ఏర్పాటు చేసిన 317 జీవో కేబినెట్ సబ్ కమిటీ స్పౌజ్ విభాగం బదిలీలు జరపాలని మంత్రి సీతక్కను స్పౌజ్ ఫోరం ప్రతినిధులు ఎ. దేవేందర్‌రెడ్డి, సాంబమూర్తి, హసన్ అలీ, ఎండీ. హుస్సేన్‌లు కోరారు. మంత్రి సీతక్కను టీటీడీ కల్యాణ మండపం వద్ద కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్పౌజ్ విభాగం బదిలీల విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఆమోదం లభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని వారు కోరారు.

ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్

- మంత్రి ధనసరి సీతక్క
- బయ్యక్కపేటలో పర్యటన



హాస్టల్‌లో ఆహారాన్ని పరిశీలిస్తున్న సీతక్క

మేడారం (ఆంధ్రజ్యోతి): ఇష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని మంత్రి సీతక్క విద్యార్థులకు సూచించారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం బయ్యక్కపేటలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆదివారం తనిఖీ చేశారు. మంత్రి విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తోందన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఆశ్రమంలో ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని లేదా సంబంధిత అధికారులకు తెలిజేయాలని నిర్వాహకులతో అన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని, శుభ్రత పాటించాలని వంట సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలో ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను మంత్రి పరామర్శించారు. వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి ధైర్యం చెప్పారు. తన స్నేహితురాలు పైపతి గౌరి మృతి తనను కలచివేసిందని భావోద్వేగానికి గురయ్యారు. మంత్రి వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు ఉన్నారు.

క్రెడిట్ కార్డుల ద్వారా అప్పులు

- తీర్చలేక యువకుడు ఆత్మహత్య



ప్రసాద్ (ఫైల్)

దుగ్గొండి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ వివిధ బ్యాంక్‌లలో క్రెడిట్ కార్డుల ద్వారా తీసుకున్న అప్పులు తీర్చలేక ఓ యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నాచినపల్లిలో ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. నాచినపల్లి గ్రామానికి చెందిన దార అనసూర్య - రాములు దంపతులకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పెద్ద కుమారుడైన దార ప్రసాద్ (38) డిగ్రీ వరకు చదివి ఏడేళ్ల నుంచి హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్న ప్రసాద్ వివిధ బ్యాంక్‌లలో క్రెడిట్ కార్డుల ద్వారా అప్పులు పొందాడు. ప్రసాద్‌కు వివాహం కాలేదు. ఇటీవల దసరా పండుగకు స్వగ్రామమైన నాచినపల్లికి వచ్చాడు. క్రెడిట్ కార్డుల ద్వారా తీసుకున్న అప్పులు చెల్లించకపోవడంతో క్రెడిట్ కార్డులకు చెందిన బ్యాంక్‌ల వారు ప్రసాద్‌ను ఒత్తిడి చేసినట్లు ఎస్సై వెల్లడించారు. దీంతో ప్రసాద్ మానసికంగా బాధపడుతూ ఉండేవాడు. శనివారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. కొంతసేపటికి బంధువులు వచ్చి ఉరి వేసుకున్న ప్రసాద్‌ను కిందికి దింపగా చనిపోయి ఉన్నాడు. చనిపోయిన ప్రసాద్ దగ్గర వివిధ బ్యాంక్‌లకు చెందిన 10 క్రెడిట్ కార్డులు ఉన్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి రాములు ఆదివారం ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.



హేమాచల క్షేత్రంలో భక్తుల కోలాహలం

హేమాచల క్షేత్రంలో సందడి

మంగపేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా మంగపేట మండలంలోని మల్లూరు హేమాచలకొండలపై వెలిసియున్న ఆదిలక్ష్మి, చెంచు లక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి పుణ్య క్షేత్రంలో ఆదివారం సందడి నెలకొంది. వారాంత సెలవు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి వచ్చారు. సుమారు 15 వేల మంది స్వామి వారిని దర్శించుకున్నారని ఆలయ అధికారులు తెలిపారు. హేమాచలం క్షేత్రానికి చేరుకున్న భక్తులు ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించారు. ఆలయ ప్రాంగణంలోని ఉప దేవాలయాల్లో దేవుళ్లను దర్శించుకొని మొక్కులు చెల్లించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఐటీఐల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో ఏడో విడత ప్రవేశాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్, హనుమకొండ ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాళ్లు ఎం.చందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోనివారు ఆన్‌లైన్‌లో చేసుకోవాల్సిందిగా వారు కోరారు. ఈ నెల 30 మధ్యాహ్నం 3 గంటలలోపు అభ్యర్థులు ప్రవేశాలు పొందగోరే ఐటీఐల్లో వారి ఒరిజినల్ సర్టిఫికేట్లతో హాజరు కావాలని వారు కోరారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

క్రైం న్యూస్

అనుమానాస్పదంగా యువకుడి మృతి

హత్య చేశారని కుటుంబ సభ్యుల ఆరోపణ



మహేష్ (ఫైల్)

గార్ల, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా గార్ల మండల పరిధిలోని సీతంపేటలో ఓ యువకుడు అను మానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శనివారం రాత్రి జరిగింది. గ్రామస్థులు, కుటుం బసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి చెందిన గుమ్మడి పాపయ్య-కుమారి దంపతుల రెండో కుమారుడు మహేష్ (27) పదకొండు ఏళ్లుగా గార్ల ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. సీతంపేటలోని అమ్మమ్మ గారి ఇంటి సమీపంలో మహేష్ గుడిసెవేసుకొని ఒక్కడే నివా సం ఉంటున్నాడు. యథావిధిగా శనివారం విధులు ముగించుకొని ఇంటి వచ్చిన మహేష్ ను రాత్రి సుమారు 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లు గ్రామస్థులు, కుటుంబసభ్యులు తెలిపారు. ముఖం మీద, కుడిచేతిపై గాయాలు కావడంతో హత్యచేసి ఉంటారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘట నా స్థలాన్ని సీఐ బి.రవికుమార్, గార్ల, బయ్యారం ఎస్సైలు జీనత్‌కుమార్, తిరుపతి సం దర్శించి వివరాలను సేకరించారు. మృతుడు సోదరుడు గుమ్మడి రాజు ఫిర్యాదు మేరకు అనుమా నాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యపై కేసు నమోదు

బయ్యారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడగా, కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట ఎస్సీ కాలనీకి చెందిన శేఖర్ (41) ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శేఖర్ గత మూడురోజులుగా మద్యం సేవిస్తూ ఇంట్లో భార్య, పిల్లలతో ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలోనే ఆదివారం మనస్థాపానికి గురైన శేఖర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో బెడ్ షీట్‌తో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు శేఖర్‌ను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. ఉరి బిగుసుకొని శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న ఉపేందర్

మహబూబాబాద్ రూరల్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారీపడి గీతకార్మికుడు పూజారి ఉపేందర్ తీవ్రగాయాలైన సంఘటన మహబూబాబాద్ మండలం అమనగల్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అమనగల్ గ్రామానికి చెందిన ఉపేందర్ రోజువారి వృత్తిలో భాగంగా గ్రామశివారులో ఉన్న తాటి చెట్టును ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు మోకుజారి, కిందపడడంతో వెన్నుపూసకు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని వెంటనే జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, చికిత్సనందిస్తున్నారు.

27న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్

- నయీంనగర్ బ్రాంచ్ చైర్మన్ వేణుగోపాల్ గౌడ్

హనుమకొండ టౌన్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27న నయీంనగర్‌లోని మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టిట్యూట్‌లో మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వ హిస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. ఆదివారం నయీంనగర్‌లోని ఇనిస్టిట్యూట్‌లో ఆయన మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఇనిస్టిట్యూట్ చైర్మన్ వేణుగోపాల్

ఈ పరీక్షను మోషన్ ఐఐటీ, నీట్ ఇనిస్టిట్యూట్ ప్రధాన కేంద్రమైన రాజస్థాన్ కోటా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈ ఎగ్జామ్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 150 కోట్ల స్కాలర్‌షిప్, 2 కోట్ల ప్రైజ్ మనీ, 500 మంది విద్యార్థులకు ఉచిత విద్య అందివ్వనున్నట్లు తెలిపారు. అలాగే మోషన్ వరంగల్ సెంటర్ నుంచి ఐదుగురికి ఉచిత విద్య, మరో ఐదుగురికి విద్యార్థులకు ఫీజుల్లో 50 శాతం రాయితీతో పాటు రూ.18లక్షల స్కాలర్‌షిప్, మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థికి ల్యాప్‌టాప్, రెండో ర్యాంకు సాధించిన విద్యార్థికి ట్యాబ్లెట్, లక్ష రూపాయాల విలువగల ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని, 10వ తరగతిలోని ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయోసైన్స్, మెంటల్ ఎబిలిటీ సిలబస్ పై 31 ప్రశ్నలతో 124 మార్క్సుకు పరీక్ష ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిగతా వివరాల కోసం నయీంనగర్ ఇనిస్టిట్యూట్‌లో గానీ, లేదా 9703000850, 51, 52 నెంబర్స్‌కు ఫోన్ చేసి పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మోషన్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్‌గౌడ్, మోషన్ బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేశ్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి.మురళి, మార్కెటింగ్ మేనేజర్ శనిగరపు సుమన్, మార్కెటింగ్ టీం సభ్యులు తాళ్లపల్లి రమేశ్, పాక నాగరాజు, రచ్చ కుమార్, మండల రాజు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

మల్చింగ్ భేష్

- మిర్చి, కూరగాయల పంటలకు వరం
- మల్చింగ్‌తో కలుపు సమస్య నివారణ
- కూలీల కొరతను అధిగమించవచ్చు
- అధిక దిగుబడికి ఆస్కారం
- మల్చింగ్ విధానంపై జిల్లా రైతుల ఆసక్తి

మొగుళ్లపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : మిర్చి, కూరగాయల పంటల సాగులో వివిధ సమస్యలను అధిగమించడంతో పాటు మంచి దిగుబడులు సాధించాలంటే ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను అవలంబించాలి. నల్లరేగడి భూముల్లో మిర్చి పంటను సాగు చేస్తే అల్ల సమస్య తీవ్రంగా ఉంటుంది. సాగునీరు పెట్టిన ప్రతిసారి కలుపు మొక్కలు పెరుగుతుండడంతో వాటిని తొలగించడం కష్టంగా మారుతోంది. ఒక్కోసారి కూలీలు అందుబాటులో ఉండక ఆర్థికభారం కూడా పెరుగుతోంది. కలుపు నివారణతో పాటు భూమిలోని తేమశాతం ఎక్కువ రోజులు ఉండేలా మల్చింగ్ విధానం ఎంతో దోహదపడుతుంది. దీంతో రైతుకు ఆర్థికభారం తగ్గడంతోపాటు పంట దిగుబడి కూడా పెరుగుతుంది. మల్చింగ్ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల రైతులకు కలుపు నివారణ, మందులు చల్లడం, కలుపు తీయడం వంటి ఖర్చులు ఉండవు. ఒక ఎకరంలో మల్చింగ్ పద్ధతిలో పంటలను సాగు చేసేందుకు సుమారు రూ.20వేల వరకు ఖర్చు అవుతుంది.

ఆతర్వాత విత్తనాలు విత్తిన నాటినుంచి పూర్తిగా పంట ఎండిపోయే వరకు ఎలాంటి కలుపు నివారణ పనులు చేయాల్సిన అవసరం లేదు. రైతులు మామూలుగా పండించే పంటలకంటే మల్చింగ్ పద్ధతిలో 30శాతం అధికంగా సాగు చేసుకోవచ్చని ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. దీంతో జిల్లాలోని రైతులు మల్చింగ్ విధానంతో పంటలు సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

మల్చింగ్ అంటే...

మొక్కల చుట్టూ వేర్ల దగ్గర మట్టిని ఏదైనా పదార్థంతో కప్పిపెట్టేదానిని మల్చింగ్ అంటారు. కృత్రిమంగా తయారుచేసే ప్లాస్టిక్ షీట్‌తో మల్చింగ్ చేయవచ్చు. ఈ పద్ధతిలో భూమిలోని తేమను సంరక్షించడంతోపాటు కలుపు నివారణ, నేల కోతకు గురికాకుండా కాపాడుకోవచ్చు. మల్చింగ్ విధానంతో రసాయన ఎరువులు, సస్యరక్షణకు అయ్యే ఖర్చును 25శాతానికిపైగా ఆదా చేసుకోవచ్చు.



మల్చింగ్ విధానంతో సాగవుతున్న మిర్చి పంట

మల్చింగ్ వేసే విధానం

మొక్కకు ఇరువైపులా ఐదు నుంచి పది సెంటీమీటర్ల లోతులో నాగలితో దున్నాలి. కావాల్సిన సైజులో మల్చింగ్ షీట్‌ను కత్తిరించుకోవాలి. దీనిని ప్రతి వరుసమీద బిగుతుగా ఇరువైపులా నాగలి సాలులోకి పోయేలా ఏర్పాటు చేసుకుని మట్టితో అంచులను కప్పి వేయాలి. ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే షీట్ వేసుకోవాలి. విత్తనం విత్తకముందే మల్చింగ్ షీట్ వేయాలనుకుంటే మొక్కల మధ్య దూరాన్ని బట్టి ముందుగానే రంధ్రాలు చేసుకోవాలి. దీంతో కలుపు సమస్య చాలా తక్కువగా ఉంటుంది.

ప్రయోజనాలు

మల్చింగ్ విధానంతో 30 శాతం వరకు సాగుకు నీరు ఆదా అవుతుంది. 70 నుంచి 90శాతం వరకు కలుపు బెడదను తగ్గించుకోవచ్చు. ఎరువులు వృథా కాకుండా సమర్థవంతంగా మొక్కలకు అందుతుంది. కూలీల ఖర్చు కూడా తగ్గుతుంది. మొక్క వేరు పైభాగంలో అనుకూలమైన వాతావరణం పెంచి వేరు వ్యవస్థ వృద్ధికి తోడ్పడుతుంది. అంతేకాకుండా వర్షాల కారణంగా మట్టి కొట్టుకుపోకుండా కాపాడుతుంది. విత్తనం మొలకెత్తేందుకు అనుకూలమైన వాతావరణం పెంచుతుంది.



పోలీసు అమరవీరుల కుటుంబాన్ని కదిలించినా హృదయం ద్రవించే కన్నీటి గాథలే వినిపిస్తాయి. తల్లిగర్భంలో ఉండగానే తండ్రిని కోల్పోయిన వారు కొందరైతే.. ఊహ తెలియని వయసులోనే కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన పిల్లలు మరెందరో.. పెళ్లయిన మూణ్ణాళ్లకే ఐదోతనాన్ని కోల్పోయిన అభాగ్య మహిళలు కొందరైతే.. భర్తను కోల్పోయి భార్య, తండ్రిని కోల్పోయి పిల్లలు జీవితాలను వెళ్లదీస్తున్నారు. కష్టాలను ఎదుర్కొంటూ, కన్నీళ్లను దిగమింగుతూ భర్త ఆశయాల కోసం, పిల్లల భవిష్యత్తు కోసం బతుకు బండిని ఎందరో మహిళలు లాక్కొస్తున్నారు. పోలీసు ఉద్యోగుల జీతాలు పెరుగుతున్నా అమరులైన పోలీసుల కుటుంబాలకు ఇస్తున్న జీతాల్లో మాత్రం ఏ మాత్రం మార్పు లేదు. వచ్చే వేతనం ఏమూలకు సరిపోక అమరుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

వీరులారా.. వందనం..

- శాంతి భద్రతల పరిరక్షణలో సమిధలు పోలీసులు
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 64 మంది అమరులు
- నేడు పోలీసు అమరవీరుల సంస్మరణ దినం

హనుమకొండ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు ఈనెల 21 నుంచి 31 వరకు పదిరోజుల పాటు నేషనల్ యూనిట్ డేగా నిర్వహిస్తున్నారు. పది రోజుల పాటు కమిషనరేట్ పరిధిలో పలు కార్యక్రమాలతో పాటు వ్యాసరచన, వక్తృత్వ, సైక్లింగ్ పోటీలను, రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నారు. 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని ముగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఆరోజు జరిగే కార్యక్రమంలో పోలీసు అమరవీరుల కుటుంబాలను ఆహ్వానించి స్మృతివనంలోని పోలీసు అమర వీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పిస్తారు. అమరుల కుటుంబాలకు జ్ఞాపికలను అందచేస్తారు.

64 మంది అమరులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 64 మంది పోలీసు సిబ్బంది అమరులయ్యారు. కానిస్టేబుల్ స్థాయినుంచి డీఎస్పీ వరకు 59 మంది వరకు పోలీసులు, 5గురు హోంగార్డులు అమరులైనవారిలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లు, మందుపాతరలలో వీరంతా అసువులు బాశారు. ప్రధానంగా 1996లో ములుగు జిల్లా జాకారం వద్ద జరిగిన మందు పాతరలో ఏడుగురు పోలీసులు బలయ్యారు. వారి కుటుంబాల్లో చీకట్లు అలముకున్నాయి. ఇంకా ఏటూరునాగారం, మంగపేట తదితర ప్రాంతాల్లో జరిగిన దుర్ఘటనలో పోలీసులు ప్రాణాలు కోల్పోయి అమరులయ్యారు.

సంక్షేమ సంఘం

2005లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమ సంఘం ఏర్పడింది. స్వయం ప్రతిపత్తి కలిగిన ఈ సంఘం ద్వారా పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారు. 2006లో కమిషనరేట్ కార్యాలయంలో సొంత కార్యాలయం ఏర్పాటైంది. నాటి ఎస్పీ స్టీఫెన్ రవీంద్ర ప్రోత్సాహంతో ఏర్పడిన పోలీసు అమరవీరుల సంక్షేమ సంఘం నేడు పోలీసు కమిషనరేట్ పరిధిలో ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్నది. పోలీసు అమరుల కుటుంబాలకు నీట్‌లో రెండు శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించడంతో పోలీసు అమర వీరుల కుటుంబాల పిల్లలు మెడిసిన్ చదవడానికి అవకాశం ఏర్పడింది.

సంస్మరణ కార్యక్రమాలు

పోలీసు అమరవీరుల సంస్మరణను పురస్కరించుకొని ఈనెల 21 నుంచి 31వ తేదీ వరకు రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఓపెన్ హౌస్, 31న ఫ్లాగ్ డే తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై పోలీసు అమరుల కుటుంబాలకు బాసటగా నిలవాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పిలుపునిచ్చారు.

- రక్తదాన శిబిరాలు : రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో హనుమకొండలో 21న, కాజీపేటలో 22న, వరంగల్‌లో 23న, మామునూరులో 24న పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో 25న, జనగామలో 26న, వర్ధన్నపేటలో 27న, స్టేషన్ ఘన్‌పూర్‌లో 28న, నర్సంపేటలో 29న, రక్తదాన శిబిరాలను నిర్వహిస్తారు.
- వ్యాసరచన పోటీలు: 8వ తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు 'విచక్షణతో కూడిన సెల్ వినియోగం' అనే అంశంపై అలాగే డిగ్రీ, ఆపై చదువులు చదువుతున్న యువతీ యువకులకు 'తెలంగాణ డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో నా పాత్ర' అనే అంశంపై వ్యాసరచన పోటీలను తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ భాషల్లో నిర్వహిస్తారు. ఉత్తమంగా రాసిన మూడు వ్యాసాలకు మూడు భాషల్లో జిల్లాల వారిగా బహుమతులు ప్రదానం చేస్తారు.
- ఫొటోగ్రఫీ పోటీలు: ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లకు కమ్యూనిటీ పోలీసింగ్, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవలతో పాటు ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలకు సంబంధించి ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహిస్తారు. ఈ పోటీల్లో పొల్గొనదలచిన ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు కిందటేడు 2022 అక్టోబర్ నుంచి ఈ యేడు 2023 అక్టోబర్ 24వ తేదీ మధ్యకాలంలో తీసిన మూడు ఫొటోలను పంపాల్సి ఉంటుంది.
- షార్ట్‌ఫిలిమ్స్: ఔత్సాహిక ఫోటో, వీడియోగ్రాఫర్లకు సైతం పోలీసు త్యాగాలు, పోలీసు విధుల్లో ప్రతిభను తెలిపేలా ఉండే ఈ మధ్య కాలంలో తీసిన మూడు ఫొటోలు, తక్కువ నిడివి (3 నిమిషాలు) గల షార్ట్ ఫిలిమ్స్ తీసి రాష్ట్ర స్థాయి పోటీల కోసం ఈనెల 22వ తేదీలోపు వరంగల్ పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో సంబంధిత షార్ట్ ఫిల్మ్ లోడ్‌చేసిన పెన్‌డ్రైవ్ 10 ఇంటు 8 సైజ్ ఫొటోలను వరంగల్ పోలీపు కమిషనరేట్ పీఆర్‌వోకు అందచేయాలి. ఈ పోటీలకు నామినేషన్లు పంపించే ఔత్సాహికులు, మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరిత్యాల్లో పోలీసుల సేవ, సైబర్ నేరాలు ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనం, వాటి అనర్థాలు, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించే అంశాలకు సంబంధించి గత సంవత్సరం 2023 అక్టోబరు నుంచి ఈ యేడు అక్టోబరు నెల వరకు తీసిన మూడు ఫొటోలు, షార్ట్ ఫిల్మ్‌లు మాత్రమే పంపించాల్సి ఉంటుంది.
- ఓపెన్ హౌస్ : పోలీసుల పనితీరుతో పాటు పోలీసులు వినియోగించే ఆయుధాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం కోసం ఆన్‌లైన్ ద్వారా పోలీసు ఓపెన్ హౌస్‌లను ఏర్పాటు చేస్తారు.
- ప్రత్యేక ప్రదర్శనలు: పోలీసు బ్యాండ్ ఆధ్వర్యంలో ట్రైసిటీ పరిధిలో వివిధ జంక్షన్లలో పోలీసు అమర వీరులను స్మరిస్తూ ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తారు.
- కళాప్రదర్శనలు: వరంగల్ పోలీసు కమిషనరేట్ జాగృతి కళాబృందంలోని కళాకారులు వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో ప్రత్యేక ప్రదర్శనలు నిర్వహిస్తారు.

మా ఇళ్ల స్థలాలను రెగ్యులరైజ్ చేయాలి

సిలివేరు రమాదేవి, పోలీసు అమరుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షురాలు



పోలీసు అమరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన ఇళ్ల స్థలాలు ఇప్పటికీ రెగ్యులరైజ్ కాకపోవడం సమస్యగా ఉంది. 67 మంది పోలీసుల అమరుల కుటుంబాలకు మడికొండ, గుండ్ల సింగారంలో 200 గజాల చొప్పున 2009లో నివేశన స్థలాలు ఇచ్చింది. ఇందులో అమరుల కుటుంబాలు ఇళ్లు కట్టుకున్నారు. అయితే ఈస్థలాలు ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ కాలేదు. వాల్యుయేషన్ జరగలేదు. రెగ్యులరైజ్ కాలేదు. దీంతో అమరుల కుటుంబాల పిల్లల ఉన్నత చదువుల కోసం లేదా కుటుంబ అవసరాల కోసం ఈ ఇళ్లు, లేదా స్థలాలపై బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడానికి వీలుకావడం లేదు. రెగ్యులరైజ్ కానుందువల్ల బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నాయి. అమరులైన పోలీసుల కుటుంబాలకు వారి బ్యాచ్‌మేట్ అయిన ఉద్యోగులతో సమానంగా వేతనాలు చెల్లించడం లేదు. అమరులైననాటికి ఉన్న మూలవేతనాన్నే (బేసిక్) ఇప్పటికీ చెల్లిస్తున్నారు. దీనివల్ల అమరుల కుటుంబాలు చాలీచాలని ఈ వేతనంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసులను మాజీ సైనికులతో సమానంగా పరిగణించి మాజీ సైనికులకు వర్తించే అన్ని ప్రయోజనాలను అమలు చేయాలి, వారి పిల్లలకు ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలి.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉన్నాం..



- స్వయం ఉపాధితోపాటు విద్య, ఉద్యోగాల కల్పనలో సహకరిస్తున్నాం..
- ఇంజనీరింగ్, మెడికల్ కోర్సుల్లో ప్రత్యేక రిజర్వేషన్లు అమలు చేయిస్తున్నాం..
- ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

శాంతిభద్రతలను కాపాడే క్రమంలో, నక్సలిజాన్ని ఎదుర్కొంటున్న నేపథ్యంలో పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెడుతున్నారు. విధి నిర్వహణలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 61మంది పోలీసుల తమ ప్రాణాలను త్యాగం చేశారు. ఈ క్రమంలో ఇంటికి పెద్దదిక్కును కోల్పోయిన పోలీసు అమరవీరుల కుటుంబాలను కాపాడే బాధ్యతను పోలీసుశాఖ తీసుకుందని, వారి కుటుంబాలకు ప్రభుత్వ సహకారంతో విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనకు కృషి చేస్తున్నామని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా చెబుతున్నారు. పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవం పురస్కరించుకుని ఆయన 'ఆంధ్రజ్యోతి ప్రతినిధి'కి ప్రత్యేకంగా ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో అనేక విషయాలను వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి: పోలీసు అమరవీరు సంస్మరణ దినోత్సవం ఎప్పటి నుంచి నిర్వహిస్తున్నారు..?

సీపీ అంబర్ కిషోర్‌ఝా: 1959 అక్టోబరు 21న భారత్, టిబెట్ సరిహద్దులోని లడక్‌లో గల ఆక్సాయ్‌చిన్ వద్ద పది మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు విధులు నిర్వహిస్తుండగా, చైనా సైనికులు భారీ సంఖ్యలో మనదేశ సరిహద్దులోకి చొచ్చుకువచ్చారు. సీఆర్‌పీఎఫ్ పోలీసులు వారిని ఎదురించేందుకు చివరి రక్తపు బొట్టును ధారపోసి దేశం కోసం ప్రాణాలు వదిలారు. అప్పటి నుంచి ఏటా అక్టోబరు 21నుంచి పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంగా పాటిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి జిల్లాలో ఎంతమంది అమరులయ్యారు? ప్రధాన సంఘటనలు ఏమి ఉన్నాయి..?

సీపీ : ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టులతో జరిగిన ప్రతిఘటనల్లో 56మంది పోలీసులు, ఐదుగురు హోంగార్డులు అమరులయ్యారు. వీరిలో పోలీస్ కమిషనరేట్ పరిధిలో 24 మంది పోలీసులు, ఒక హోంగార్డు ప్రాణాలను త్యాగం చేశారు. 1985లో కాజీపేట ఎస్‌ఐ యాదగిరిరెడ్డిపై అప్పటి పీపుల్స్‌వార్ నక్సలైట్లు రైల్వేస్టేషన్ వద్ద కాల్పులు జరపటంతో మృతి చెందారు. వరంగల్ జిల్లాలో ఇదే తొలి దుర్ఘటన. పోలీసు కమిషనరేట్‌లో కాన్ఫరెన్స్ హాల్‌కు యాదగిరిరెడ్డి పేరు పెట్టడంతో పాటు వారి కుటుంబానికి పోలీసులు, ప్రభుత్వం అండగా నిలుస్తోంది. ములుగు జిల్లా జాకారం వద్ద జరిగిన మందుపాతర పేలుడులో ఏడుగురు పోలీసులు మృతి చెందారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలో నక్సలైట్లతో జరిగిన పోరాటంలో 61మంది తమ ప్రాణాలను త్యాగం చేశారు.

ఆంధ్రజ్యోతి : అమరవీరు కుటుంబాలకు ఏ విధంగా అండగా నిలుస్తున్నారు..?

సీపీ : మావోయిస్టులతో జరిగిన పోరాటంలో అసువులు బాసిన పోలీసుల అమరవీరులకు ప్రభుత్వం ప్రోత్సాహంతో అన్ని విధాలుగా అండగా ఉంటున్నాం. గతంలో వరంగల్ ఓఎస్‌డీగా పనిచేసిన సమయంలో స్వయంగా అమరవీరుల కుటుంబాలను ప్రతీనెల కలిశాను. ఇంటికి పెద్దదిక్కును కోల్పోయిన వారు అనేక సమస్యలును ఎదుర్కొనేవారు. సాధ్యమైనంత వరకు పరిష్కార మార్గం చూపించాం. వరంగల్ రూరల్ ఎస్పీగా, ప్రస్తుతం వరంగల్ సీపీగా పనిచేసే అవకాశం వచ్చింది. దీంతో 30 ఏళ్ల కిందట ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు పోలీసుశాఖ అన్ని రకాలుగా అండగా నిలుస్తోంది. అమరుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వటం, నివేశన స్థలాలు కూడా ఇచ్చాం. వారి పిల్లల చదువులకు సహకారాన్ని అందించాం. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఇంజనీరింగ్, మెడికల్ కోర్సులో ఒక శాతం రిజర్వేషన్‌ను తీసుకువచ్చాం. ఈ రిజర్వేషన్ కోటాలో పోలీసు అమరవీరుల పిల్లలు ఐదుగురు వరకు మెడికల్ సీట్లు పొందారు.. చాలామంది ఇంజనీరింగ్ పూర్తి చేశారు. పిల్లలు ఇతర ఉద్యోగాల్లో స్థిర పడ్డారు. మరికొంత మందికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాం. ప్రజలకు ప్రాణాలను త్యాగం చేసిన ప్రతీ పోలీసు కుటుంబానికి అండగా పోలీసుశాఖ నిలుస్తోంది.

ఆంధ్రజ్యోతి: అమరవీరుల కుటుంబాలను ఆదుకునేందుకు ఏమైనా ప్రత్యేక సెల్ నిర్వహిస్తున్నారా..?

సీపీ : గతంలో మావోయిస్టుల ఉద్యమం వరంగల్, కరీంనగర్ జిల్లాల్లో ఎక్కువగా ఉండేది. ఈ ప్రాంతంలోనే జరిగే ఎన్‌కౌంటర్‌లు, బ్లాస్టింగుల్లో చాలామంది పోలీసులు ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేసేవారు. ఆ సమయంలో ఓఎస్‌డీలు ఎప్పటికప్పుడు అమరవీరుల కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సమీక్షించేవారు. ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించేది. గతంలో వరంగల్ ఓఎస్‌డీగా పని చేసిన అనుభవం నాకుంది. ఇక్కడ ప్రతీ వారం, పదిహేను రోజులకోసారి అమరవీరుల కుటుంబాలను కలిసి సమస్యలు తెలుసుకునేవాళ్లం. ప్రస్తుతం నక్సలిజం లేదు. పైగా వరంగల్ కమిషనరేట్ కావటంతో ఓఎస్‌డీ పోస్టు లేదు. అయినప్పటికీ ఎప్పుడో 20-30 ఏళ్ల కిందట ప్రాణత్యాగం చేసిన పోలీసుల కుటుంబాలను యోగక్షేమాలు తెలుసుకుంటున్నాం. వారికి ఎలాంటి ఇబ్బంది వచ్చిన పరిష్కరిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టుల కదిలికలు ఎలా ఉన్నాయి..?

సీపీ : తెలంగాణలో మావోయిస్టుల ఉనికే లేదు. కొద్దిగా భద్రాద్రి కొత్తగూడెం అటవీప్రాంతంలో కనిపించేంది. 2016లో భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీగా పని చేసిన కాలంలో మావోయిస్టు సానుభూతిపరుల్లో మార్పుతీసుకు వచ్చాం. చాలామంది ప్రభుత్వానికి లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిశారు. ప్రస్తుతం చత్తీస్‌గఢ్‌లో కూడా మావోయిస్టులు ఉనికి కోల్పోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి. తెలంగాణ పోలీసులు దేశంలో బెస్ట్ పోలీసులు. గోదావరి దాటి మావోయిస్టులు రాష్ట్రంలో అడుగుపెట్టే అవకాశాలు లేవు. ప్రజలు అలాంటి వారికి ఎట్టి పరిస్థితుల్లో సహకరించవద్దు.

ఆంధ్రజ్యోతి: ఈ పది రోజులు ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు..?

సీపీ : అక్టోబరు 21వ తేదీ నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన జాతీయ సమైక్యతా దినోత్సవం 31వ తేదీ వరకు పోలీస్ కమిషనరేట్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రధానంగా పోలీసు కుటుంబాలకు హెల్త్ క్యాంపు ఇప్పటికే నిర్వహించాం. నేటి నుంచి రక్తదాన శిబిరాలు, ఛాయాచిత్రాల పోటీలు, షార్ట్ ఫిలిమ్ పోటీలు, విద్యార్థులకు వ్యాస రచన, పాటలు, నృత్యం తదితర పోటీలను నిర్వహిస్తున్నాం. అమరవీరుల సంస్మరణ సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో పోలీసులతో పాటు ప్రజలను భాగస్వాములను చేస్తున్నాం. ప్రతీ ఒక్కరు ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలి.



నాటి అమరుల గాథ

పోలీసు అమరవీరులను స్మరించుకునే రోజుకు మహోతన్నత చరిత్ర ఉంది. 1959 అక్టోబర్ 21 భారత్ - టిబెట్ సరిహద్దుల్లోని లడక్‌లో గల అక్సాయ్‌చిన్ వద్ద భారత్‌కు చెందిన కేంద్ర రిజర్వు పోలీసులు (సీఆర్‌పీఎఫ్) రక్షణగా ఉన్నారు. విపరీతమైన చలిలో 10 మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు విధులు నిర్వహిస్తుండగా చైనా సైనికులు భారీ సంఖ్యలో మన దేశ సరిహద్దుల్లోకి చొచ్చుకువచ్చారు. వారిని ఈ పది మంది పోలీసులు ధైర్యంగా ఎదరించారు. చివరి రక్తపు బొట్టు వరకు పోరాడి దేశం కోసం అసువులు బాశారు. భారత దేశ రక్షణ కోసం పోలీసులు ప్రాణాలు వదిలిన తొలి సందర్భమది. ఇందుకుగాను అన్ని రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు 1960 జనవరి 9న సమావేశమయ్యారు. అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించాలని తీర్మానించారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా అక్టోబరు 21న పోలీసు అమర వీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు. అమర పోలీసుల త్యాగాన్ని స్మరించుకొని వారి కుటుంబాలకు సానుభూతిని, సహకారాన్ని ప్రకటించి వారికి ఘనమైన నివాళులర్పిస్తున్నారు.



దామెర గ్రామ కూడలిలో ఉన్న మూడు వేప చెట్లు

చరిత్రకు సాక్ష్యాలు ఈ వృక్షాలు..

మూడు తరాల జ్ఞాపకాలకు వారధిగా నిలుస్తున్న వైనం

ఆ మూడు వేప చెట్లే అడ్డా..

ఎల్కతుర్తి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రజాకార్ల కాలంలో రచ్చబండ నిర్వహణ కోసం రెడ్డి దొరలు నాటిన మొక్కలు.. నేడు భారీ వృక్షాలై గ్రామ కూడలిలో దర్శనమిస్తున్నాయి. రజాకార్ల రచ్చబండ పంచాయితీలు, నక్సలైట్ల కాలంలో ప్రజా దర్బార్‌లుగా, నేడు పంచాయితీలకు, ప్రజా సమావేశాలకు నిలయంగా మారాయి. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో సుమారు 150 యేళ్ల కిందట చింతలపాణి వెంకటరాంరెడ్డి అనే రెడ్డి దొర నాటిన నాలుగు వేప మొక్కల్లో మూడు పెద్ద పెరిగి భారీ వృక్షాలుగా మారి గ్రామానికే తలమానికంగా నిలిచాయి.

రచ్చబండగా..

రజాకార్ల హయాంలో ఆ గ్రామానికి చెందిన రెడ్డి దొర చింతలపాణి వెంకటరాంరెడ్డి గ్రామంలో సమస్యల పరిష్కారానికి వేదిక కోసం తన ఇంటి ఆవరణలో నాలుగు వేప మొక్కలు నాటినట్లు గ్రామస్థులు తెలిపారు. అందులో మూడు వేప చెట్లు భారీ వృక్షాలుగా పెరిగి నేటికి దర్శనమిస్తున్నాయి. నాడు రజాకార్లతో పాటుగా రెడ్డి దొరలు పంచాయితీల నిర్వహణను ఈ వేప చెట్ల కిందనే రచ్చబండ వేదికగా నిర్వహించే వారని చెపుతున్నారు.

ప్రజా దర్బార్‌కు వేదికగా..

20 ఏళ్ల కిందట దామెర గ్రామంలో అడుగుపెట్టాలంటే పోలీసులకు, అటు ప్రజాప్రతినిధులకు సవాలుగా ఉండేది. మావోయిస్టు ప్రభావిత ప్రాంతంగా దామెరకు పెట్టింది పేరు. ఆ పార్టీలో కేంద్ర, రాష్ట్ర కమిటీలకు చెందిన ప్రముఖులకు నిలయంగా నిలిచింది. గ్రామంలో ఎలాంటి సమస్య వచ్చినా గ్రామకూడలిలో ఉన్న ఆ వేప చెట్ల కిందనే ప్రజా దర్బార్ ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించేవారని చెబుతున్నారు. చెట్ల కింద ఎన్ని విపత్తులు, దాడులు జరిగినా వేపచెట్లకు మాత్రం ఎవరూ ఎలాంటి హాని తలపెట్టలేదు. దీంతో చెట్లు ఏపుగా పెరిగి విశాలంగా విస్తరించాయి.

దామెర గ్రామంలో ప్రజాదర్బార్, పంచాయితీలకు కేంద్రం

ఏ కార్యం చేపట్టినా ఈ చెట్ల కిందనే..

గ్రామంలో ఏ కార్యక్రమం చేపట్టినా ఈ చెట్ల కింద నుంచే ప్రారంభిస్తారు. ప్రభుత్వ కార్యకలాపాలు, గ్రామ సమావేశాలే కాకుండా చివరకు వివాహాల్లో వరుడికి విడిదిగా కూడా ఈ చెట్లనే వాడుకుంటారు. ఇక వేసవి కాలంలో ఇళ్లల్లో కన్న ఎక్కువగా ఈ చెట్ల కిందనే గ్రామస్థులు ఎక్కువగా సేదతీరుతారు. కులమతాలకతీతంగా ఉగాది పర్వదినం రోజున ఎక్కడాలేని విధంగా ఫకీర్ షా వలి జాతర జరుపుకోవడం అక్కడి ప్రసిద్ధి. ఆ రోజు గ్రామస్థులతో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఈ చెట్ల నీడన సేదతీరాకే జాతరకు వెళతారు. అనంతరం చెట్ల కింద నిర్వహించే పంచాంగ శ్రావణాన్ని వినడానికి వేలల్లో చేరుకుంటారు. దసరా రోజున దుర్గమ్మ పూజ సైతం ఒక్కడే నిర్వహిస్తారు. రైతులు వ్యవసాయ పనులు ముగించుకుని వచ్చి మధ్యాహ్నం వేళ ఈ చెట్ల నీడన సేదతీరుతారు. ఎలాంటి టెంట్లు వేయకుండా ఒకేసారి 1000 మంది ఈ చెట్ల కింద ఆశ్రయం పొందవచ్చని స్థానికులు చెబుతున్నారు.

రోజుకోసారైనా చెట్ల కిందకు వస్తా..

మద్దె చిన్న రాజమౌళి గ్రామస్థుడు, దామెర



నా చిన్న వయస్సు నుంచి రోజుకు ఒక్కసారైనా వేప చెట్ల కిందకు వచ్చి వెళతా.. వ్యవసాయ పనులకు వెళ్లి మధ్యాహ్నం వచ్చిన తరువాత ఇంటి దగ్గర కన్నా ఈ చెట్ల కిందనే ఎక్కువగా ఉంటా. ఈ ఊరి రెడ్డి దొర నాటి చెట్లు నేటికి పచ్చగా ఉన్నాయి. చల్లటి గాలి ఈ చెట్ల కింద లభిస్తుంది.

మూడు వేప చెట్లు ఆదర్శం

మంతుర్తి కొమురయ్య, దామెర



వాతావరణంలో కాలుష్య నివారణకు నాటి పెద్దలు నాటిన మొక్కలు నేడు మహావృక్షంగా దర్శనమిస్తున్నాయి. ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించడంవల్ల ముందుతరాలకు అవి దోహదపడుతాయని చెప్పుకోవడానికి ఇవి నిదర్శనం. ఈ వేపచెట్లు కాలుష్యాన్ని నివారించడంతో పాటు చల్లని గాలిని అందిస్తున్నాయి. ఈ వేపచెట్ల చరిత్రను నేటి విద్యార్థులకు వివరించి వాటి వల్ల కలిగే ఉపయోగాలను పట్ల వారిని చైతన్య వంతులను చేయాలి.



దామెరకుంటలో 120 ఏళ్ల నాటి చింత చెట్టు

కాటారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కొన్ని చెట్లు 60, 70ఏళ్ల బతకడం చూస్తుంటాం. కానీ ఇక్కడ మాత్రం వందేళ్లకుపైగా నిటారుగా నిలబడి పలువురిని ఆశ్చర్యచకితులను చేస్తున్నది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని దామెరకుంట ప్రాథమిక పాఠశాల, వైద్య, ఆరోగ్యశాఖ సబ్ సెంటర్ ఆవరణలో సుమారు 120ఏళ్ల నాటి చింతచెట్టు భారీ కాండంతో ఉండటం విశేషం. చెట్టు కాండం చుట్టుకొలత సుమారు 25ఫీట్లకు పైగా ఉండటం గమనార్హం. ఆరుగురు వ్యక్తులు ఒకరిచేతులు ఒకరుపట్టుకుని చెట్టును అలుముకున్నా పూర్తిగా చేతులు అందకపోవడం సంభ్రమాశ్చర్యం కలిగిస్తోంది. గ్రామం మధ్యలో ఉన్న చింత చెట్టు ప్రజలకు నీడనివ్వడమే కాకుండా మాట ముచ్చట్లకు వేదికగా, పిల్లలు, గృహిణులకు అందించి బహుళ ప్రయోజనకారిగా ఉంటూ పలుతరాల జ్ఞాపకాలకు ఆనవాలుగా ఉంది. గ్రామానికి చెందిన నక్కయ్య అనే 98ఏళ్ల పెద్దమనిషి తాను 10ఏళ్ల పిల్లాడిగా ఉన్నప్పుడేఈ చింతచెట్టు వృక్షంగా ఉండేదని తన జ్ఞాపకాలను పంచుకున్నాడు.

గ్రామీణాభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ధర్మారావుపేటలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలో ఆయన ఆదివారం పర్యటించారు. ధర్మారావుపేట నుంచి అప్పయ్యపల్లి వరకు బీటీరోడ్డు, లక్ష్మారెడ్డిపల్లెలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే అన్ని గ్రామాలు అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుమార్, మాజీ సర్పంచ్ కుమారస్వామి తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులపై 'టోల్' బాదుడు

కాటారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి వద్ద శనివారం ప్రారంభమైన టోల్ ప్లాజాతో ఆర్టీసీ ప్రయాణికులపై పెనుభారం పడుతోంది. గతంలో ఉన్న బస్సు చార్జికి అదనంగా రూ.10 టోల్‌ఫీజు పేరిట వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు లబోదిబోమంటున్నారు. పెద్దలకు, పిల్లలకైనా అంతే రుసుము వసూలు చేస్తున్నారని అంటున్నారు. భూపాలపల్లి బస్టాండ్ నుంచి ఆర్టీసీ బస్సు ఎక్కిన ప్రయాణికులు మేడిపల్లి టోల్‌గేట్‌కు సమీపంలో ఉన్న గ్రామాల వద్ద బస్సు దిగినా రూ.10టోల్‌ఫీజు రూపంలో గత చార్జికి అదనంగా చెల్లించి టిక్కెట్ పొందాల్సిందేనని కండక్టరు చెబుతున్నారని ప్రయాణి కులు తెలిపారు. దగ్గరి ప్రయాణాలకు సైతం ఇలా వసూలు చేస్తే ఎలా అని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు తమ బాధ ఆలకించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్



పీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న సాంబశివరెడ్డి

మంగపేట, అక్టోబరు, 20 (ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌ను జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రాన్ని పీసీసీ అధ్యక్షుడికి అందజేశానని సాంబశివరెడ్డి తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ బుచ్చిరెడ్డి, అకినేపల్లి- మల్లారం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు షేక్ మొయినొద్దీన్ తదితరులు ఉన్నారు.

మిరప నారు చోరీ

కన్నాయిగూడెం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బొమ్మరాజు రవీందర్‌కు చెందిన మిరప నారు చోరీకి గురైంది. ఈ మేరకు ఎస్సై వెంకటేశ్ తెలిపారు.

పాండవుల గుట్టలను సందర్శించిన టూరిజం విద్యార్థులు



పాండవుల గుహ వద్ద టూరిజం విద్యార్థులు

రేగొండ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావులపల్లి గ్రామ శివారు పాండవుల గుట్టలను టూరిజం విద్యార్థులు ఆదివారం సందర్శించారు. రాతి కొండల ఆకృతులను, పురాతన రాతి చిత్రాలను తిలకించారు. పాండవుల గుట్టల చరిత్రను, విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెరిటేజ్ ట్రస్ట్ సభ్యులు శ్రీధర్‌రావు, టూరిజం ప్రమోటర్ సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని రైతులకు రైతుభరోసా అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో నాయకులు ఆదివారం ములుగులోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తంచేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీల్లో ఒకటైన రైతుభరోసా ఇవ్వకుండా రైతులను మోసం చేస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా రైతుభరోసా అందించాలని, లేనట్లయితే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పోరిక గోవింద్‌నాయక్, గండ్రకోట సుధీర్, సురేందర్, మసరగాని వినయ్‌కుమార్, విజయ్‌రాంనాయక్, గొర్రె సమ్మయ్య, అరెందుల కుమార్, కోగిల మహేష్, ఓదెలు, ఆదిరెడ్డి, కుమార్, యువరాజు, గడ్డమీది భాస్కర్, దాసరి రమేష్, ఖాసిం, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.



గోవిందరావుపేటలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

- గణపురం (ఆంధ్రజ్యోతి): రైతుభరోసా పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు గణపురం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కరుణకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లక్ష్మీనర్సింహరావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు పూర్ణచందర్ రెడ్డి, బీఆర్ఎస్ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మేకల రజిత నాయకులు మధుసుదన్‌రావు, శ్రీనివాస్, కుమారస్వామీ, రజియా, సుదకర్, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- రేగొండ (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంకం రాజేందర్ ఆధ్వర్యంలో పరకాల- భూపాలపల్లి రహదారిపై బీఆర్ఎస్ నిరసన కార్యక్రమం జరిగింది. పార్టీ జిల్లా నాయకుడు రూపిరెడ్డి చంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ హమీద్, నాయకులు కానుగంటి శ్రీనివాస్, దగ్గు వెంకటేశ్వరరావు, సూదనబోయిన సుమన్, రఘుసాల తిరుపతి, సాదు నరేష్, దాట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.
- ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. పార్టీ మండల అధ్యక్షుడు గడదాసు సునీల్‌కుమార్, సీనియర్ నాయకుడు తుమ్మ మల్లారెడ్డి, పీఏసీఏస్ చైర్మన్ కూనూరు అశోక్ గౌడ్, మాజీ సర్పంచ్ ఈసం రామ్మూర్తి, రామన్నగూడెం మాజీ సర్పంచ్ దొడ్డ కృష్ణ, నాయకులు సప్పిడి రామ్‌నర్సయ్య, ధనపునేని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.
- కన్నాయిగూడెం (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య ఆధ్వర్యంలో ఏటూరునాగారం-తుపాకులగూడెం ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం జరిగింది. నాయకులు కావేరి చిన్ని కృష్ణ, పూజారి కిషోర్, మఠం వెంకటేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.
- చిట్యాల (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ నిరసన కార్యక్రమం మాజీ జడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అల్లం రవీందర్ అధ్యక్షతన జరిగింది. పీఏసీఎస్ చైర్మన్ క్రాంతికుమార్‌రెడ్డి, నాయకులు పిట్ట సురేష్, రవీందర్‌రావు, రాజేందర్, రమేష్, వీరస్వామి, శంకర్, బుర్ర శ్రీధర్, పెరుమాండ్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.
- మంగపేట (ఆంధ్రజ్యోతి): మండలంలో జరిగిన బీఆర్ఎస్ నిరసన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకా ర్యదర్శులు కుడుముల లక్ష్మీనారాయణ, గుండేటి రాజుయాదవ్, నియోజకవర్గ నాయకుడు తాటి కృష్ణ, వ సహకార సంఘం చైర్మన్, తోట రమేష్, వైస్ చైర్మన్ నరేందర్‌యాదవ్, ములుగు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కోరం సంతోష్, మేడారం ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్ చిలుకమర్రి రాజేందర్, మంగపేట సహకార సంఘం డైరెక్టర్లు చిట్టిమల్ల శ్రీలతసమ్మయ్య, నర్ర శ్రీధర్, ఎ. సత్యనారాయణ పాల్గొన్నారు.
- మొగుళ్లపల్లి (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బలుగూరి తిరుపతిరావు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ వద్ద ఆందోళన చేపట్టారు. నాయకులు కొడారి రమేష్, జోరిక సదయ్య, వెంకటరెడ్డి, జగ్గారావు, శ్రీనివాస్, చంద్రమౌళి, రవీందర్, రాములు, రహీం, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.
- కాటారం(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. పార్టీ మండల ఇన్‌చార్జి జోడు శ్రీనివాస్, యూత్ మండల అధ్యక్షుడు రామిళ్ల కిరణ్, నాయకులు ఊర వెంకటేశ్వర్‌రావు, మండల లక్ష్మారెడ్డి, పంతకాని సడవలి, గాలి సడవలి, రాజేంద్రచారి, ఉప్పు సంతోష్, జక్కు శ్రావణ్, వెంకటస్వామి, శ్రీశైలం, సతీష్, సమ్మయ్య, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.
- గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో జాతీయ రహదారిపై నిరసన కర్యాక్రమం జరిగింది. బీఆర్ఎస్ నాయకులు సూడి శ్రీనివాసరెడ్డి, ఆలూరి శ్రీనివాసరావు, వెలిశాల స్వరూప, రామచంద్రనాయక్, లకావత్ చందూలాల్, భూక్య దేవానాయక్, భూరెడ్డి మధు, నాం పూర్ణచందర్, బైకని ఓదెలు తదితరులు పాల్గొన్నారు.
- టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం జరిగింది. మండల ప్రధాన కార్యాదర్శి తిరుపతి, నాయకులు బొడ్డు సదానందం, అది రఘు, పోతనవేణి ఐలయ్య, వెంకటేశ్వర్లు, దొడ్ల కోటి తదితరులు పాల్గొన్నారు.



కాటారంలో బీఆర్ఎస్ శ్రేణుల నిరసన

జిల్లాస్థాయి కళా ఉత్సవ్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కళా ఉత్సవ్ జిల్లాస్థాయి పోటీల్లో ములుగు మండలంలోని బండారుపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభను చాటారు. పాటల పోటీల్లో యు.బన్నీ(ప్రథమ), స్టోరీ టెల్లింగ్‌లో డి.ఝాన్సీ(ప్రథమ), డాన్స్ పోటీల్లో ఎస్.మానస గ్రూప్ (ప్రథమ), చిత్రలేఖ నంలో పి.యువరాణి ద్వితీయ బహుమతి అందుకున్నారు. ఈసందర్భం ఆదివారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవకితోపాటు ఉపా ధ్యాయులు విద్యార్థులను అభినందించారు. నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని వారు సూచించారు. ఈ కార్యక్ర మంలో మండల విద్యా శాఖ అధికారి సామల శ్రీనివాసులు, డీసీఈబీ కార్యదర్శి ఇ.సూర్య నారాయన, ఏఎంవో మల్లారెడ్డి, డీఎస్‌వో జయదేవ్, ఉపాధ్యాయులు కందాల రామయ్య, సి.హెచ్ ప్రసన్ కుమార్, శ్రీనివాసాచారి, సముద్రాల కుమారస్వామి, హలావత్ కృష్ణ, ఎస్.పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు కార్మికుల దుర్మరణం

మరో ముగ్గురికి తీవ్రగాయాలు

దేవరుప్పుల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చిన్న అజాగ్రత్త రెండు నిండు ప్రాణాలను బలికొంది. బతుకుదెరువు కోసం వచ్చిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం కలిచివేసింది. ఈ విషాదకర ఘటన జనగామ జిల్లా జనగామ-సూర్యాపేట రాష్ట్ర రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ కథనం ప్రకారం.

కర్నూల్ జిల్లా మొగితికి చెందిన బోయ నర్సింహ (20), వనపర్తి జిల్లా మాదాపురంనకు చెందిన చీరేలు భరత్(22) కలిసి కొడకండ్ల మండలం రామన్నగూడెంలో ప్లంబింగ్ పనికోసం వచ్చారు. పని మీద బైక్‌పై జనగామ-సూర్యాపేట రహదారిపై దేవరుప్పులకు బయలుదేరారు. గొల్లపల్లి బస్‌స్టేజీ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసేందుకు యత్నించారు. ఇదే సమయంలో ఎదురుగా వస్తున్న టాటా ఏస్ ట్రాలీ వాహనాన్ని ఢీకొట్టి, ఆర్టీసీ బస్సుకు తగిలారు. దాంతో బైక్ అదుపుతప్పి కిందపడిపోయారు. తీవ్రంగా గాయపడిన నర్సింహా, భరత్ కిందపడి అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.

సింగరాజుపల్లికి గ్రామానికి చెందిన కొంగరి భాస్కర్(డ్రైవర్) టాటా ఏస్ వాహనంలో తలుపులు, కిటికీలు తీసుకురావటానికి మొండ్రాయి వెళ్తున్న రాపాక ఉప్పలయ్య, రేణుక ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మృతదేహాలను జనగామ మార్చురీకి తరలించి, వారి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారమిచ్చారు. మృతుల కుటుంబ సభ్యుల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అవమాన భారంతో యువకుడి ఆత్మహత్య

బలవన్మరణానికి ప్రేరేపించారనే ఆరోపణలపై ఇద్దరి అరెస్టు

మల్హర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అవమాన భారంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కొయ్యూర్ ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీ పరిధి చిగురుపల్లి గ్రామానికి చెందిన కుర్రి రవితేజ(20) గ్రామంలో కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తు న్నాడు. మహదేవపూర్ మండలం పెద్దంపేట గ్రామానికి చెందిన బంధువుల అమ్మాయితో అతడికి ప్రేమ ఏర్పడింది. ఈ క్రమంలో ఈనెల 5న ఆ యువతిని పెళ్లి చేసుకొనేందుకు రవితేజ ఇంటికి తీసుకొచ్చుకున్నాడు. ఇది అదే గ్రామంలో ఉంటున్న యువతి మేనమామలు గుంటి సంతోష్ అలియాస్ ఇనుముల సంతోష్, గుంటి శ్రీకాంత్‌కు తెలిసింది. దీంతో వారు రవితేజ ఇంటికి వెళ్లి గొడవకు దిగారు. గ్రామస్థులు చూస్తుండగానే దాడికి పాల్పడ్డారు. అమ్మాయిని తీసుకొచ్చినందుకు పురుగుల మందు తాగి చచ్చిపోమని, లేదా తామే చంపేస్తామని రవితేజను బెదిరించారు. బలవంతంగా ఆ యువతిని అక్కడి నుంచి తీసుకెళ్లారు. దీంతో రవితేజ మనస్తాపం చెందాడు. తనను యువతి మేనమామలు అవమాన పర్చడాన్ని జీర్ణించుకోలేక గడ్డి మందు తాగాడు. దీంతో కుటుంబ సభ్యులు రవితేజను భూపాలపల్లిలోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందిస్తున్నా ఆరోగ్యం మరింత క్షీణించడంతో ఇక బతకడం కష్టమని వైద్యులు చెప్పగా కుటుంబ సభ్యులు రవితేజను శనివారం ఇంటికి తీసుకొచ్చుకున్నారు. ఈ క్రమంలోనే అతడు మృతి చెందాడు. యువతి మేనమామలు ఆత్మహత్యకు ప్రేరేపించడంతోనే తమ కుమారుడు ప్రాణాలు కోల్పోయాడని తండ్రి శంకరయ్య ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని గుంటి సంతోష, గుంటి శ్రీకాంత్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

పీహెచ్‌సీలో 20 ఏళ్ల తర్వాత ప్రసవం

మొగుళ్లపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మొగుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో 20 తర్వాత ప్రసవం జరిగింది. వైద్యాధికారి నాగరాణి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన ఇంజపెల్లి మౌనిక ఆదివారం పండంటి ఆడబిడ్డ జన్మించింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు వైద్యాధికారి నాగరాణి తెలిపారు. 20ఏళ్ల క్రితం అప్పటి మెడికల్ ఆఫీసర్, ప్రస్తుత హనుమకొండ డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి ఆధ్వర్యంలో సాధారణ ప్రసవం జరిగింది. అప్పటి నుంచి ఒక్కటి ప్రసవం కూడా జరుగలేదు. మొట్టమొదటిసారి సాధారణ ప్రసవం జరగడంతో వైద్యసిబ్బంది, మండల ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తూ డాక్టర్ నాగరాణిని అభినందించారు. డాక్టర్ నాగరాణి వెంట డాక్టర్ విద్యాసాగర్, స్టాఫ్‌నర్సు కల్పన, ఆశా కార్యకర్త కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ముదిరాజ్ మహాసభ యూత్ ఉపాధ్యక్షుడిగా ప్రదీప్



గణపురం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ మహాసభ యూత్ జిల్లా ఉపాధ్యాక్షుడిగా జోడు ప్రదీప్‌ను నియమించారు. ఈ మేరకు ఆదివారం ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు జోరుక సదయ్య వెల్లడించారు. తన ఎన్నికకు కృషి చేసిన సంఘం నేతలకు ఈ సందర్భంగా ప్రదీప్ కృతజ్ఞతలు తెలియజేశారు.

రేగొండ మండలం నుంచి ధనుంజయ



రేగొండ (ఆంధ్రజ్యోతి): ముదిరాజ్ మహాసభ యూత్ జిల్లా అధ్యక్షుడిగా రేగొండ మండలానికి చెందిన మారబోయిన ధనుంజయను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు జోరిక సదయ్య పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు బండా ప్రకాశ్, జిల్లా నాయకులకు ధనుంజయ కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఏటూరునాగారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మండల ఆ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు అన్నారు. ఏటూరునాగారం మండలం రొయ్యూరు గ్రామంలోని ఆదివారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిత్యం ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యల సత్వర పరిష్కారానికి పార్టీ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహరావు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా మురహరి



కాటారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరాంపల్లి గ్రామానికి చెందిన కొండపర్తి మురహరి స్వర్ణకార సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామగిరి సదానందం, కట్టా శంకరమూర్తి నియామకపత్రం జారీ చేశారు. స్వర్ణకారుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని మురహరి తెలిపారు. మురహరి నియామకంపై పలు వురు హర్షం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

కాకతీయఖని, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు ఈనెల 21 నుంచి 28 వరకు అసెస్‌మెంట్(ఎస్ఏ)-1 పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ముద్దమల్ల రాజేందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 27,827 మంది పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు.

స్విమ్మింగ్ క్రీడాకారులకు ఎమ్మెల్యే సన్మానం

కాకతీయఖని, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో పతకాలు సాధించిన భూపాలపల్లి స్విమ్మర్స్ పైడిపల్లి సాయి వెంకట్, తాళ్ల వరుణ్‌బాబును ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత శికారాలను చేరుకోవాలని ఆశీర్వదించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మదన్‌మోహన్, రమేష్, ప్రశాంత్‌రెడ్డి, వేణు, తిరుపతి, శ్రీరాములు, సంపత్‌రావు, సాంబమూర్తి, కొమురయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు

గొత్తికోయగూడెంలో కమ్యూనిటీ కాంటాక్ట్

భూపాలపల్లి కృష్ణకాలనీ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి మండలంలోని దూదేకులపల్లి గొత్తికోయగూడెంలో భూపాలపల్లి పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తికోయ ప్రజల సాధక బాధకాలను అడిగి తెలు సుకున్నారు. ఇటీవల కొత్త వ్యక్తులెవరైనా వచ్చి వెళ్లారా అనే విష యాల్ని ఆరా తీశారు. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే సమా చారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సుధాకర్, సివిల్, స్పెషల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గోవుల తరలింపు.. పోలీసుల తనిఖీ

మేడారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారం మీదుగా మూడు వాహనాల్లో 28 గోవులను ఆదివారం తరలిస్తుండగా మేడారం, రెడ్డిగూడెం గ్రామాలకు చెందిన గోరక్షకులు అడుకున్నారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడికి చేరుకున్న పోలీసులు అనుమతులను పరిశీలించారు. ఆంధ్రప దేశ్ రాష్ట్రం ఏలూరు ఆగిరిపల్లి మండలానికి చెందిన సుబ్బరాజు అనే వ్యక్తి శ్రీకృష్ణ బాబాజీ గోశాల నడుపుతున్నారని, రెండు నెలలు హిమాల యాలకు ఆయన వెళ్తున్న క్రమంలో గోవులను సంరక్షణ, పోషణ కోసం కాళేశ్వరంలోని గోశాలకు వీటిని తరలిస్తున్నట్లు గుర్తించారు.

నిత్యం.. భయం భయం

పట్టించుకోండి..



వంతెనకు ఒకవైపు ధ్వంసమైన రెయిలింగ్

మల్హర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి-భూపాలపల్లి జిల్లాల మధ్య ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. 1971లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి పీవీ నర్సింహరావు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని సోమన్‌పల్లి మానేరుపై ఈ బ్రిడ్జిని ప్రారంభించారు. అప్పటి నుంచి 53 ఏళ్లుగా వంతెన వాడుకలో ఉంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు వంతెన పై నుంచి రాకపోకలు సాగిస్తుంటాయి. ఇదిప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. పలుచోట్ల గుంతలు ఏర్పడి ఇనుప చువ్వలు బయటకు తేలాయి. వంతెన పైకి చెట్లు చొచ్చుకొని రావడంతో ఇరుకుగా మారింది. రెయిలింగ్ దెబ్బతింది. దీంతో వాహనాలు అదుపు తప్పి మానేరులో దూసుకెళ్తే పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాత్రి వేళల్లో వంతెనపై ప్రమాదం పొంచి ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాని కోరుతున్నారు.

జిల్లా నాటక సమాజాల కార్యవర్గం ఎన్నిక

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ములుగులోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో తెలంగాణ రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మారేజోడు సదానందచారిల ఆధ్వర్యంలో ఆదివారం ములుగు జిల్లా నాటక సమాజాల నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పోరిక శ్యామల్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా బుసిగొండ రవీందర్, గౌరవ అధ్యక్షులుగా రామంచి రాణాప్రతాప్, కూరాకుల సమ్మయ్య, గౌరవ సలహాదారులుగా చల్లగురుగుల మల్లయ్య, కూరాకుల శ్యాంసుందర్, కత్తుల ఐలయ్య, లావుడ్యా జైల్‌సింగ్, ఉపాధ్యక్షులుగా అమ్మ కుమారస్వామి, దాసి వనమాల, సహాయ కార్యదర్శిగా మిట్ట రవి, కార్యదర్శులుగా కొడెం రాజయ్య, బానోతు భద్రునాయక్, కోశాధికారిగా బుసిగొండ రామస్వామి, సభ్యులుగా జేరిపోతుల రామచంద్రం, గడ్డం జీవరత్నం, కొయ్యడ లక్ష్మి, గడ్డం రజితలు ఎన్నికయ్యారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సదానందం మాట్లాడుతూ జిల్లాలోని కళాకారులు మూడు నెలలకోసారి తమ కళలను ప్రదర్శించాలన్నారు. నాటకాలను ప్రోత్సహించాలని అన్నారు.


ఎల్‌ఈడీ లైట్ల వితరణ

మొగుళ్లపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన చిలుకూరి వెంకట్రాంరెడ్డి గ్రామపంచాయతీకి 20 ఎల్‌ఈడీ విద్యుత్‌లైట్లను వితరణ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి సుజాత తెలిపారు. ఎల్ ఈడీ విద్యుత్‌లైట్ల విలువ రూ.60 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

కాటారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్రాత్‌పల్లిలో ఉన్న ఉట్లపల్లి పోచమ్మ గుడి వద్ద కాంగ్రెస్ నాయకులు, భక్తులు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రప టానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. గుండ్రాత్‌పల్లి నుంచి పోచమ్మ గుడి వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయించడంపై హర్షం వ్యక్తం చేశారు.

గాలి వాన బీభత్సం.. పంటలకు నష్టం



కాటారం మండలం చింతకానిలో నీటమునిగిన మిర్చి పంట



మహాముత్తారం మాదారంలో నేలకొరిగిన వరి పంట

కాటారం, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. పలు చోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడగా, పలువురి ఇళ్ల పైకప్పులు దెబ్బతిన్నాయి. ఒక్కసారిగా వచ్చిన గాలివానతో మండల వ్యాప్తంగా వందలాది ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి తదితర పంటలకు నష్టం వాటిల్లింది. గాలివానతో పలు చోట్ల వరి వెన్నులు, పత్తి మొక్కలు నేలవాలాయి. మంచి వర్షాలు కురిసి పంటలు బాగుండి అధిక దిగుబడులు వస్తాయని ఆశిస్తున్న తరుణంలో గాలివానతో పంటలు దెబ్బతినగా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బూడిదపల్లి, విలాసాగర్, దేవరాంపల్లి, రేగులగూడెం, ధన్వాడ, గంగారం, శంకరంపల్లి, చింతకాని, గోపాల్‌పూర్, గూడూరు, కొత్తపల్లి, కాటారం, గారెపల్లి, దామెరకుంట తదితర ప్రాంతాల్లో కోతలకు సిద్ధంగా ఉన్న వరి, ఏరడానికి సిద్ధంగా ఉన్న పత్తి పంటలు నేలవాలాయి. వరి నేలవాలి నీళ్లలో పడటంతో తీవ్రంగా నష్టం వాటిల్లుతోందని రైతులు లక్ష్మారెడ్డి, రవి, రాజేష్, సమ్మయ్య, శంకర్, రాజయ్య, బాపు తదితరులు ఆవేదన వ్యక్తంచేశారు. చాలా చోట్లా ఏరడానికి సిద్ధంగా ఉన్న పత్తి పంట వర్షంతో రంగు మారి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఏర్పడింది. గాలి వానకు వందలాది ఎకరాల్లో పత్తిచెట్లు గాలివానకు నేలవాలాయి. నష్టపోయిన తమను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

మహాముత్తారం మండలంలో..

మహాముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని శనివారం రాత్రి కురిసిన వర్షానికి పత్తి వరి పంటలకు నష్టం వాటిల్లింది. మాదారం, జీలపల్లి, లంబడిపల్లె, దొమ్మలపాడు, మహాముత్తారం, యామన్‌పల్లి గ్రామాల్లో కోతకు వచ్చిన వరి నేలకొరిగింది. ఈదురు గాలులతో కూడిన వర్షంతో పత్తి కొమ్మలు విరిగిపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం అధికారులతో సర్వే నిర్వహించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.